# మేలిముసుగు



ఫోన్ మ్రోగింది.

రాత్రి పదిగంటలు దాటింది. వ్రాసుకుంటున్న కథని ఆపుచేసి ఫోన్ పైకెత్తాను.

"హలో"

"హలో! ప్రతిమ ఉందా" ఎవరిదో స్త్రీ గొంతు.

"ఎవరు మీరు?" అడిగాను.

"అది... నంబరేనా?" నా ఫోన్ నెంబరు చెప్పింది.

"అవును! యిది నా నంబరే! ఎవరు కావాలమ్మా!"

"ప్రతిమ ఉందో లేదో చెప్పండి. నాకు ప్రతిమ కావాలి!"

"ప్రతిమ ఊళ్ళో లేదు. యింతకీ మీ పేరు..."

ఫోన్ టక్కున కట్ అయిపోయింది.

మళ్లీ రెండు నిముషాల్లో ఫోన్ మ్రోగింది. ఫోన్ ఎత్తాను.

"యస్! ఎవరు మాట్లాడుతున్నారు?" అడిగాను నేను.

"మీరు.. మీరు ప్రతిమ భర్తగారా!" ఆమే మళ్లీ!

"అవును. చెప్పండమ్మా! ఏం కావాలి!"

"సార్ అయామ్ వెరీ సారీ. నేను ప్రతిమ డియరెస్ట్ ఫ్రెండ్‌ను. నా పేరు మాళవిక. తనూ నేనూ ఒక్క ప్రాణంగా కలిసి పెరిగాం. మాది అమలాపురం." ఆమె ఏదో చెప్పబోతోంది.

నేను ఈసారి ఫోన్ పెట్టేశాను.

మంచి మూడ్‌లో ఉన్న నా కథ ప్లాటంతా పాడుచేసింది.

మళ్లీ ఫోన్ మోగింది మరో రెండు నిముషాల్లో.

"ఏమిటమ్మా! ఏం కావాలి మీకు. మీరు ప్రతిమ ఫ్రెండ్ అయితే కావచ్చు. కానీ నా భార్య ప్రస్తుతం ఊళ్లో లేదు. నన్ను డిస్టర్బ్ చేయకండి మరోసారి ఫోన్ చేసి!" కటువుగా సీరియస్‌గా అన్నాను.

"సారీ సర్! మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యడం నా అభిమతం కాదు శ్రీకాంత్‌గారూ!"

"నా పేరు కూడా తెలుసుకున్నారన్న మాట!"

"అన్నమాటే కాదు. మీ రచనలు అన్నీ చదివాను. మీ కథ పడిన ప్రతీ సంచిక నా దగ్గర ఉంది."

నేను విసుగ్గా ఫోన్ పెట్టేయ బోయి ఆగాను.

"యిపుడు మీరింక ఫోన్ పెట్టరు

శ్రీకాంత్‌గారూ!"

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలరు?" యింట్రస్ట్ లేకపోయినా కుతూహలంగానే అడిగాను.

"మీరు వ్రాసిన కథలన్నీ నాకు చాలా నచ్చాయి శ్రీకాంత్‌గారూ. చాలా వెరైటీ ప్లాట్ తీసుకోవడం, చివర సందేశం యిస్తూ కథ ముగించే విధానం, కథను మించిన కథనం, అందులో మీ నైపుణ్యం, ఓహ్! నాకు చాలా చాలా యిష్టం. యిలా మీ కథలను గూర్చి చెప్పే అభిప్రాయం వినకుండా మీరు ఫోన్ పెట్టరనే ధైర్యంతోనే అలా అన్నాను. అయితే మీరు వ్రాసే కథల్లో, శృంగార కథలు ఉండడవే నాకు ఎందుకో ముల్లు గుచ్చుకున్నట్టుగా ఉంటుంది శ్రీకాంత్ గారూ!"

నాకు కోపం వచ్చింది.

అయినా నిగ్రహించుకుని చెప్పాను.

"ఆ కథలు వ్రాసినా కేవలం భావం మేలి ముసుగులోంచి తొంగిచూస్తున్నట్టుగా కనిపిస్తుందే తప్ప డైరెక్టుగా అభ్యంతరకర పదాలు, అసభ్య వర్ణనలు రాకుండా చాలా జాగ్రత్త తీసుకుంటూ వ్రాస్తాను. 'శృంగార కథ కూడా సహజమైన వర్ణనతో కుటుంబ కథలా మలిచే రచయిత మీరొక్కరే' అని ప్రశంసించిన లేఖలు నాకు ఎన్నో వచ్చాయి. మా యింటికి వస్తే చూపిస్తాను" అన్నాను వ్యంగ్యంగా.

"మీరు నా స్నేహితురాలి భర్త అని ఖచ్చితంగా తెలియు బట్టేకాబోలు శ్రీకాంత్‌గారూ! ఈ మధ్య కవితలలో మీ ఫోటో చూసి అనుకున్నాను."

"ఏమని?"

"నా అభిమాన రచయిత రసికుడే కాదు. కవిపండితుడు కూడా అని."

"మీ అభిమానానికి థాంక్స్. వ్యక్తిముఖం చూసినంత మాత్రాన అతను వ్రాసే కథలన్నీ తన అనుభవాలేనని, అతని మనస్తత్వం తన కథల్లోని పాత్రల మనస్తత్వాల సమ్మేళనం అని అనుకుంటే పొరపాటు! అయినా ఎవరో ఏదో అనుకున్నారని నేను రచనలు చేయడం లేదు. నా రచనలు సామాజిక స్పృహ కలిగి ఉన్నాయా లేదా అని ఆలోచిస్తాను. తనకోసమే వ్రాసినా కృష్ణశాస్త్రి గారి గీతాల్లో ఎంత సందేశం ఉంటుందో, ఆత్రేయగారి పాటలు హృదయాన్ని ఎక్కడ తాకితే గాయం మానుతుందో, అంత అద్భుతమైన కవి చక్రవర్తుల మధ్య నేనెంత? నా రచన లెంత? ఏం ఆశించి వారు అం .. సాహిత్య కృషి చేశారు? వారి కాలిగోటికి కూడా పోలని నేను ఎటువంటి రచన చేసినా సరే కాలక్షేపం కోసం కాదు. సమాజానికి ఓ సందేశం యివ్వాలి అన్నదే నా ధ్యేయం. నా అనుభవం మరొకరికి గుణపాఠం కావాలనే నా ఆరాటం. వాటిని ఆలంబనగా చేసుకుని రచన సాగించే ప్రవృత్తి నాది. అందుచేత ఒక కథారచయిత వ్యక్తిత్వాన్ని అతని కథలోని పాత్రలతో ఎపుడూ అంచనావేయకండి. ఉంటాను

గుడ్‌బై!" టక్కున ఫోన్ పెట్టేశాను.

ఈసారి వెంటనే ఫోన్ మ్రోగింది.

"శ్రీకాంత్‌గారూ, మిమ్మల్ని బాధ పెడితే క్షమించండి. నా బాధ చెప్పుకోవాలని ఫోన్ చేసి ఏదేదో మాట్లాడేశాను. నన్ను మనస్ఫూర్తిగా క్షమించండి. నేను... నేను చాలా యిబ్బందిలో ఉన్నాను. దయచేసి ఫోన్ పెట్టేయకండి!"

ఒక్కక్షణం మౌనంగా ఆలోచించాను.

"యిబ్బంది అంటే?"

"రేపు నా కజిన్ సిస్టర్‌కి ఎంగేజ్‌మెంట్ - ఏలూరులో."

"అయితే?"

"అనుకోకుండా బయల్దేరిన నేను తాడేపల్లిగూడెం వచ్చేసరికి లాస్ట్‌బస్ వెళ్లిపోయింది, జి.యన్.టి రోడ్ మీద ట్రాఫిక్‌జామ్ వల్ల. వెంటనే ప్రతిమ గుర్తుకొచ్చింది. అందుకని ఈ రాత్రి మీ యింట్లో ఉండి రేపు ఉదయం అక్కడనుంచి బయల్దేరి ఏలూరు వెళ్దామని మీ యింటికి రావడం కోసం ఫోన్ చేశాను. మీరేమో ప్రతిమ లేదంటున్నారు" ఆమె మాటలకు నాకు జాలేసింది నిజంగా!

"అరెరె! అలాగా! యింతకీ మీరెక్కడ నుంచి మాట్లాడుతున్నారు?"

"బస్ కాంప్లెక్స్ నుంచి!"

"నిజమే నమ్మా! ప్రతిమ నిజంగా వూళ్లో లేదు. మీకు.. మీకు అభ్యంతరం లేకుంటే మా యింటికి రావచ్చు" అనుమానంగా అన్నాను.

"మీ యింటికి తను లేనప్పుడు వస్తే... బాగుండదేమో!"

"నాకా? మీకా?"

"పోన్లెండి. ఎవరికైతేనేం. నేను మీ యింటికి రాలేను."

"మీ యిష్టం. మీకు నమ్మకం ఉంటే రండి. కథా రచయిత శ్రీకాంత్‌పై అపనమ్మకం అయితే మానేయండి" నిర్మొహమాటంగా అన్నాను.

ఆమె రెండు నిముషాలు మౌనం వహించింది.

ఆలోచించుకున్నట్టుంది.

"నేను వస్తున్నాను శ్రీకాంత్‌గారూ! మరి మీ యిల్లు నాకు తెలీదే! మీ వివాహానికి నేను రాలేదు. మిమ్మల్ని ఫోటోలో చూశాననుగా! నన్ను ఏం చేయమంటారు?"

"ఆ మాటలన్నీ నేను అడగాలి. యింతకీ మీరు ఎక్కడ నుంచి మాట్లాడుతున్నారు?"

"కాంప్లెక్స్‌లో ఎస్.టి.డి. బూత్ నుంచి"

"నేను వచ్చి పికప్ చేసుకుంటాను. మీరు అక్కడే వెయిట్ చెయ్యండి" నేను యింక సమాధానం చెప్పకుండా ఫోన్ పెట్టేశాను.

★★★

నేను డ్రస్ చేసుకుని యింటికి తాళం వేసి స్కూటర్ తీసుకుని కాంప్లెక్స్‌కి వచ్చాను.

నల్లగా బక్కగా ఒకావిడ ఎస్.టి.డి. బూత్‌లోంచి బయటకు వచ్చి ఆత్రుతగా

ఎదురుచూస్తోంది. ఆలోచించకుండా ఆమె దగ్గరకు వెళ్లాను స్కూటర్ పార్క్ చేసి.

"అమలాపురం నుంచి వచ్చిన మాళవిక మీరేనా?"

"నేనా? అమలాపురంనుంచా? కాదే."

"అయాం సారీ" అన్నాను.

"ఏం! కావాలా! యిపుడే ఫోన్ చేసి బుక్ చేసుకున్నాడొకడు. మీరింకో రెండొందలు ఎక్కువిస్తే మీ స్కూటరెక్కేస్తా!"

అంతే! ఒక్క గంతులో స్కూటర్ మీద నేను, స్కూటర్ రోడ్డు మీద పరుగో పరుగు.

కాంప్లెక్స్‌గేటు బయటకు వస్తుంటే అపుడు కనిపించిందామె. వెదకబోయిన "బంగారు తీగ" కాలికి తగిలినట్టుగా.

"మీరు... అమలాపురం నుంచి...." స్కూటర్ ఆపి అడిగాను.

"అవును! నా పేరు మాళవిక!"

"అమ్మయ్యా! బ్రతికించారు రండి!" ఆమె లగేజి స్కూటర్‌కి తగిలించాను.

ఆమె స్కూటర్ వెనక్కు వచ్చి ఎక్కబోయింది.

"మన్నించండి! మీరు రిక్షా ఎక్కండి. నేను ఫాలో అవుతాను"

"బాగుండదేమో!" అందామె అనుమానంగా.

"పోనీ నేనే ముందు స్కూటర్ పోనిస్తాను. నన్ను రిక్షాలో ఫాలో అవండి! ఈ సారి బాగుంటుందేమో!"

"మీరు రచయిత ఎలా అయ్యారో యిప్పటికి అర్థమైంది!"

"చెప్పానుగా! నా అనుభవం యితరులకు గుణపాఠం కావాలనన్నదే నా ధ్యేయమని"

ఆమె సమాధానంకోసం ఎదురు చూడకుండా రిక్షా పిలిచాను.

★★★

ఇంటికి వచ్చాక ఆమెకు పిల్లలగది చూపించాను.

ఆమె స్నానం చేసి వచ్చేసరికి ఉప్పుడు పిండి చేశాను.

"యింత త్వరగానా!" ఆమె సంభ్రమాశ్చర్యాలతో అడిగింది.

"చాలా ఆకలి మీద ఉన్నట్టున్నారు. తినండి!"

"నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు"

"జవాబు ప్రశ్నలోనే ఉన్నపుడు సమాధానం అనవసరం అనుకుంటా!" అన్నాను ఆమెకు అర్థమైనట్టుంది.

"రియల్లీ మాశ్వ ' హ ప్రతిమ చాలా అదృష్టవంతురాలు!"

"థాంక్యూ మీరు నా కథలు రెగ్యులర్‌గా చదువుతారా" అదినాకు.

"మీ రచన పడిన వెంటనే ప్రతిమ నాకు ఫోన్ చేస్తుంది. వెంటనే దాన్ని కలెక్ట్ చేసుకోవడం నా హాబీ!"

"మీ వంటి మంచి విమర్శకురాలు నాకు అభిమానిగా ఉన్న విషయం నాకు యింతవరకూ తెలియదు."

"అదేమిటి? ప్రతిమ మీకు చెప్పలేదా ఏనాడూ నా గురించి!"

"మీ గురించి చెప్పింది. అయితే మీకీ హాబీ ఉన్నట్లు చెప్పలేదు."

ఆమె తింటున్నంతసేపూ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంది.

లస్సీ చేసి యిచ్చాను త్రాగింది.

"మీ పిల్లల్ని తీసుకురాలేదా!"

"లేదండి! పిల్లలను కూడా తీసుకువస్తే ఆయన భోజనానికి యిబ్బంది పడతారు. పైగా ఆయనకు హోటల్ భోజనం పడదు. అన్నట్లు ఆయనకో ఫోన్ చేసుకోవచ్చా!" నేనిక్కడ చిక్కుపడి పోయానని తెలియక కంగారు పడతారు!" సరేనన్నాను. ఆమె ఫోనులో మాట్లాడింది. తర్వాత తిన్న ప్లేటు కిచెన్‌లో మోరీలో పడేసి వచ్చింది.

అప్పుడు చూసింది.

నా టేబుల్‌పై వ్రాసి ఆపేసిన కాగితాలని. యధాలాపంగా తలెత్తిన ఆమెకి టేబుల్‌పై కనబడిన పెయింటింగ్ కార్డుని నన్ను వింత వింతగా మార్చి చూసింది.

"యిది ఎదురుగా పెట్టుకుని కథలు వ్రాస్తున్నారా! పైగా ఏదో సమాజాన్ని ఉద్ధరించడం కోసం కథలు వ్రాస్తున్నట్లు లెక్చర్ యిచ్చారు యిందాక?" ఆమె దాన్ని నా మొహంపైకి విసురుతూ అంది.

నేను క్రిందపడిన ఆ పెయింటింగ్ కార్డు తీసి చూశాను తదేకంగా.

అది రాజా రవివర్మ తైలవర్ణ చిత్రం - 'ది సకింగ్ ఛైల్డ్!' మైసూరు ఆర్ట్‌గేలరీలోది.

"యిందులో మీకేం తప్పు కనిపించింది?" ఆశ్చర్యంగా అడిగాను నేను.

"యింకా తప్పేం కనిపించింది అని అడుగుతున్నారా సిగ్గు లేకుండా! ఒక స్త్రీ తన బాబుకి పాలిస్తోంటే దాంట్లో కూడా కామాన్ని వెతుక్కుంటూ మీరు వ్రాసే కథలకు శృంగార కథలు అని పేరు పెట్టుకుంటూ మేలి ముసుగు వేసుకునే కుసంస్కారులు మీరు. ఛీ.. మీరంటేనే.."

"ప్లీజ్ స్టాప్ మిస్ మాళవిక. ప్లీజ్ స్టాప్!. ఈ చిత్రంలో తన బిడ్డకు పాలిస్తూ మాతృత్వాన్ని అనుభవిస్తున్న ఓ స్త్రీని సాటి ఆడదానిగా చూడాల్సింది పోయి, అలాంటి అద్భుత దృశ్యాన్ని కనులముందు సజీవంగా ఉంచగలిగిన రవివర్మలాంటి మహా కళాకారుడి కళా నైపుణ్యాన్ని కళ్లకద్దుకోవడం పోయి యిలా మాట్లాడుతున్నారంటే... మీరు... మీరసలు కన్నతల్లే కాదు. అతిథిగా మా యింటికి వచ్చారు. అదీ నా భార్యలేని సమయంలో. మీ మర్యాద మీరు కాపాడుకుని ఉదయమే వెళ్లిపొండి. దయచేసి మీరెప్పుడూ యిక్కడకి రాకండి. ఉంటాను. గుడ్‌నైట్!"

కాగితాలు అన్నీ తీసుకుని కోపం బలవంతంగా నిగ్రహించుకుంటూ నా బెడ్‌రూమ్‌లోకి వచ్చేసి లోపేమని తలుపులు వేసేసుకున్నాను.

"మాతృత్వం"పై నేను వ్రాస్తున్న కథ

మధ్యలోనే ఆగిపోయింది. ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. ఆమె మాటలకి గుండెల్లో అయిన గాయం రేగుతూనే ఉంది.

★★★

మరుసటిరోజు ఉదయం 7 గంటలు దాటాక మెలకువ వచ్చింది.

కళ్లు విపరీతంగా మండిపోసాగాయి.

లేచి హాల్లోకి వచ్చాను.

పిల్లల రూమ్ తలుపు దగ్గరగా వేసుంది.

మెల్లగా తట్టాను.

తలుపులు కొద్దిగా తెరుచుకున్నాయి.

నా గుండెలు ఝల్లుమన్నాయి. తలుపులు బార్లా తెరిచాను.

ఆమె, ఆమె లగేజీ గదిలో లేదు. ఎక్కడ వస్తువులు అక్కడ అలాగే ఉన్నాయి.

మళ్లీ హాల్లోకి వచ్చిన నాకు ఎదురుగా నా టేబుల్‌పై రెపరెపలాడుతున్న ఉత్తరం కనిపించింది.

ఆత్రంగా చేతుల్లోకి తీసుకుని చదివాను. అందులో-

"శ్రీకాంత్ అన్నగార్కి,

మాళవిక హృదయపూర్వక నమస్కృతులు. నేను యాదృచ్ఛికంగా మీ యింటికి వచ్చి ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. మిమ్మల్ని అవమానించించబోయిన నా అజ్ఞానానికి మన్నించండి.

మీరు నన్నెపుడూ చూడలేదు. అయినా మీరు నన్ను ఎంతో ఆప్యాయంగా గౌరవించారు. నా అభిప్రాయాలకు ఎంత విలువనిచ్చారు. ముందుగా పరిచయం లేని ఒక వ్యక్తికి, అందులోనూ స్త్రీకి, మీరు రాత్రిపూట ఆశ్రయం యివ్వడం - మీ సంస్కారం. స్త్రీ ఒంటరిగా దొరికితే అభ్యంతరకరమైన ప్రవర్తన ప్రదర్శించని మీ ఆత్మవిశ్వాసం మీ ఆత్మ సౌందర్యాన్ని మరింత పెంచింది. మీ భార్యపట్ల మీకున్న ప్రేమకు యింతకంటే తార్కాణం ఏం కావాలి? అందుకే అది అదృష్టవంతురాలు. మీమీద ఎంతో నమ్మకం, అచంచలమైన ప్రేమ ఉన్న ప్రతిమ కేవలం నా మాటల ప్రభావం వలన మీ మీద మేలి ముసుగులాంటి ఒక చిన్న అనుమానం ఏర్పడింది. అది ఏమిటంటే "ఎన్నోరకాల అనుభవాలు వివాహానికి ముందు ఉంటే గాని ఏ రచయితా అంత అద్భుతమైన శృంగారకథలు వ్రాయలేడు" అన్నది నా వాదన. 'మేలి ముసుగు' లాంటి ఆ అనుమానాన్ని తొలగించి మీరు అత్యుత్తమ వ్యక్తే కాదు, అత్యుత్తమ రచయిత అని నిరూపించుకున్నారు. మీకు ముఖం చూపించలేక యిలా వ్రాత పూర్వకంగా క్షమాపణ కోరుతున్నాను. నా అవివేకాన్ని మన్నించమని కోరుతూ -

సదా మీ అభిమాని

- మాళవిక."

"తన మీద తనకు ఆత్మ విశ్వాసం లేనివాడు రచయిత కాలేడు. అసలు ఏ పనీ

చేయులేదు మాళవికా! నీ తప్పు తెలుసుకున్న నువ్వు అభినందనీయురాలవు"

నేను ఆ ఉత్తరాన్ని వదిలంగా దాచుకున్నాను.

★★★

మరో రెండు రోజుల్లో ప్రతిమ ఊరు నుంచి వచ్చేసింది. మాళవిక విషయం చెప్పేసరికి ఆశ్చర్యపోయింది. "తను వచ్చేసరికి లేకుండా పోయానే" అని చాలా బాధపడింది. ఆ సాయంత్రం తను ప్రక్కింటి పార్వతమ్మగారితో గుడికి వెళ్లింది.

వీధిలో యిస్త్రీ బండి వెంకటేశు "చీరలు తీసుకోండి అబ్బాయిగారూ! అమ్మగారు గుడికి వెళ్తూ యిచ్చారు" అన్నాడు.

వ్రాసుకుంటున్న నేను లేచి వెళ్లక తప్పింది కాదు.

అది తీసుకుని ప్రతిమ చీరల బీరువా తెరచి చీరలన్నీ ఒబ్బిడిగా పెడదామని లోపలి చీరలు కూడా బయటకు తీస్తుంటే అప్పుడు పడింది - వాటి మధ్య దాగున్న ఉత్తరం.

అది ప్రతిమకి మాళవిక వ్రాసింది. అందులో యిలా ఉంది.

"ప్రతిమా!

పిచ్చిమొహమా! 'అనుమానం' అనే మేలి మునుగులో దాక్కుని బాధపడుతూ నువ్వెంత సుఖపడుతున్నావో నాకు అర్థమైంది. అందుకే నిన్ను మన ప్లాన్ ప్రకారం రెండు రోజులు మీ అమ్మగారింటికి వెళ్లిపొమ్మన్నాను. నీ భర్త నిజంగా దేవుడు. రచయిత అయిన ప్రతీవాడికీ సిగరెట్టు, తాగుడు, వ్యభిచారం అలవాట్లే ఉండాల్సిన అవసరం లేదు. ఆత్మవిశ్వాసం, విషయ సంగ్రహణాశక్తి ఉంటే చాలు అని ఋజువు చేసిన ఉదాత్తవ్యక్తి నీ శ్రీవారు. నీ 'అనుమానం' మేలి ముసుగును నేనే నీకు వేసినట్టు మీ ఆయనతో అబద్ధం చెప్పాను. నాకు తెలిసి నీ అంత అదృష్టవంతురాలైన భార్య నా పరిచయస్తులలో లేరు. ఆ 'అనుమానం' మేలి ముసుగును అంటించేసి హాయిగా సంసారం చేసుకో. నా ప్రయాణం అనుకోకుండా కలిసి రావడంతో వెంటనే నీ సమస్యకు పరిష్కారం చూపగలిగాను. మనం అనుకున్నవిధంగా నేను గ్రహించిన విషయం ఈ లెటర్ రూపంలో వ్రాసి నీ చీర మడతల్లో పెడుతున్నాను. విష్ యూ హేపీ ఎంజాయింగ్ ఫ్యూచర్"

నీ ప్రాణ స్నేహితురాలు

- మాళవిక"

నవ్వుకున్న నేను నా కొత్తకథకు చక్కని ఆలోచన వచ్చి 'మేలిముసుగు'అన్నటైటిల్‌తో కథ వ్రాయడం ప్రారంభించాను.

●

'ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక'
29-09-2000